విశాఖపట్టణం
బుధవారం 17 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:144 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## హోం మంత్రి అనిత సంస్కార హీనురాలు



పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసారు

అమిత్ షా తో చీవాట్లు తినడం వాస్తవం కాదా

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

వైసీపీ ఎమ్మెల్సీ వరదు కల్యాణి మండిపాటు

3

# పెట్టుబడులకు గమ్యస్థానం ఏపీ



### వేగంగా ప్రాజెక్టులకు అనుమతులు జారీ

### ఆపరేషనల్ యూనివర్శిటీస్ తో ఉపయుక్తం

### డేటా డిటవ్రెన్ తో పౌర సేవలు అందిస్తున్నాం

### సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఏపీకి మంచి సంబంధాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని ప్రస్తావిం చారు. మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోకి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షోని సీఐఐ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ని తయారు చేశామని తెలిపారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా ..మిగతా 2లో




## అనిత వర్సెస్ అమర్

### ఇరువురి మధ్య డైలాగ్ వార్

### మండిపడుతున్న పార్టీ శ్రేణులు

### రాజకీయంగా గరంగరం

(విశాఖపట్నం - జయజయహే)

వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై సరైన సమయంలో స్పందిస్తానని అన్నారు. తనతో సహా మహిళల్ని కించేపరిచే విధంగా రాజకీయ ముసుగు వేసుకుని మాట్లాడుతున్న వారికి మరో వేదికపై ఖచ్చితంగా సమాధానం ఇస్తానని అన్నారు. పోలీసుశాఖ పనితీరుపై గొప్పగా చెప్పుకునే సమయంలో అనవసర వ్యక్తులు చేసిన వ్యాఖ్యలపై చర్చకు తావివ్వనని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఒక మాట పొరపాటున మాట్లాడితే తమ ముఖ్యమంత్రి తమని పిలిచి మందలిస్తారన్నారు. అది ఇతర పార్టీలు ఎందుకు పాటించవో అర్ధం కాదని తెలిపారు. మహిళల్ని కించపరిచే వారు, అసభ్య పోస్టులు పెట్టే వారు తమకు కూడా తల్లి, చెల్లి ఉన్నారని గ్రహించాలని హితవు పలికారు. ఒక ఆడబిడ్డపై పెట్టే పోస్టు ఆ తల్లికి తెలియాల్సిన అవసరం ..మిగతా 2లో

## డ్రగ్ పెడ్లర్స్ నెట్ వర్క్

### హైదరాబాద్‌లో 19 మంది అరెస్టు

### అందరికీ గంజాయి పాజిటివ్

### ఆంధ్ర, కర్ణాటక, గోవాలో మూలాలు

### 15 బృందాలతో ఈగిల్ టీం ఆపరేషన్

(హైదరాబాద్ - జయజయహే)



తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈగల్ ఫోర్స్ మరో కీలక ఆపరేషన్ నిర్వహించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ..మిగతా 2లో

## త్వరలో నంది అవార్డులు

### విధివిధానాల చర్చ... రూట్ మ్యాప్ ఖరారు

### ఫిలం డవలప్మెంట్ కార్పొరేషన్ నిర్ణయం

3



### జులై మూడో వారంలో

## తల్లికి వందనం

### నగదు జమపై ప్రభుత్వం కసరత్తు

(అమరావతి - జయజయహే)

విద్యా రంగంలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు పేద, ..మిగతా 2లో

## దగ్గు సిరప్‌పై కేంద్రం కొరడా

### ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మితే చర్యలు

### కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంస్థ ఆదేశాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)




వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో నేరుగా దగ్గు సిరప్‌లు కొనుగోలు చేసే రోజులకు కేంద్ర ప్రభుత్వం ముగింపు పలికింది. ఇకపై ఎలాంటి సిరప్ ఆధారిత మందులనైనా కొనుగోలు చేయాలంటే డాక్టర్ రాసిన చీటీ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 'డ్రగ్స్ (ఐదవ సవరణ) నిబంధనలు, 2026'ను నోటిఫై చేసింది. డ్రగ్స్ రూల్స్, 1945లోని 'షెడ్యూల్ కె' మినహాయింపుల జాబితా నుండి 'సిరప్స్'ను తొలగిస్తూ ఈ ..మిగతా 2లో




## టెలిగ్రామ్‌పై తాత్కాలిక బ్యాన్

### జూన్ 30 వరకు సేవలు నిలిపివేత

### నీట్ రీ ఎగ్జామ్ కోసం ఎన్టీఏ ఆదేశాలు

### పేపర్ లీక్ భారీ మోసాలపై ఆగ్రహం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 రీ-ఎగ్జామినేషన్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ ఛానెళ్లపై తాత్కాలికంగా బ్యాన్ విధిస్తూ ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో ప్రశ్నాపత్రం లీక్ పేరుతో తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు టెలిగ్రామ్ ప్లాట్‌ఫామ్‌పై జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. అలాగే టెలిగ్రామ్‌లో ఇప్పటికే పోస్ట్ చేసిన సందేశాలను సవరించే ..మిగతా 2లో

## తెలంగాణ గడ్డకు పవన్

### హనుమకొండకు పర్యటన..

### చూడాలన్న అబిమాని కోరిక కోసం రాజకీయాలకు అతీతంగా టూర్

### గతంలో తెలంగాణ జాగీరు కాదన్న కాంగ్రెస్ నేతలు

(హైదరాబాద్ - జయజయహే)

పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన, భావోద్వేగ కారణం ఉంది. బుధవారం రోజు వరంగల్ హనుమకొండలో మృత్యువుతో పోరాడుతున్న తన వీరాభిమాని నిరంజన్ చివరి కోరిక మేరకు పవన్ కళ్యాణ్ అతని ఇంటికి వెళ్లను పవన్ కల్యామ్‌ను చూడాలనే తన చివరి కోరిక మేరకు అతని ఇంటికి వెళ్లనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు. హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి. ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ..మిగతా 2లో



## బీసీలపై గొడ్డలి పార్టీ కక్ష

### బలహీన వర్గాలను వేధించడమే జగన్ లక్ష్యం

### వైసీపీ అధినేత జగన్ పై మంత్రి లోకేశ్ ధ్వజం

(అమరావతి - జయజయహే)



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళ్తున్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు. నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. జగన్ ..మిగతా 2లో

# అనిత వర్సెస్ అమర్

మొదటి పేజీ తరువాయి...

ఉందన్నారు. హోంమంత్రి అనితపై మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళల కట్టూబొట్టుపై వ్యాఖ్యానం చేసే స్థాయికి వైఎస్సార్సీపీ నేతలు దిగజారిపోయారని పవన్ విమర్శించారు. ఆ వ్యాఖ్యలు కేవలం అనితను అన్నట్లు కాదని సగటు మహిళలందరినీ కించపరచినట్లేనని పవన్ అభిప్రాయపడ్డారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని హెచ్చరించారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని అవి విధాన పరంగానే ఉండాలని అభిప్రాయపడ్డారు. ఏదైనా ఓ విధానం నచ్చకపోతే ఆ విషయంపైనే విమర్శించాలన్నారు. నోటికొచ్చినట్లు ఇళ్లలోని స్త్రీలను కించపరచే నైజం ఉన్న పార్టీ నేతలు చేసే వ్యాఖ్యల్ని బలంగా తిప్పికొట్టాలని కూటమి నేతలకు సూచించారు. వారు మాట్లాడే మాటలు ఎంతటి అభ్యంతరకరమైనవో ప్రజలకు తెలియచెప్పాలన్నారు. పౌర సమాజం హర్షించే భాషలోనే కూటమి నేతలందరూ బలంగా బదులివ్వాలని పవన్ స్పష్టం చేశారు. అవతలి పార్టీవాళ్లలా దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమికి అవసరం లేదన్నారు. సంస్కారం లేని వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు:



హోంమంత్రి అనితపై మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు సహజం కానీ మహిళలను అవమానించేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఒక మహిళా మంత్రిని మేకప్ మంత్రి అని సంబోధించడం ఆమెను మాత్రమే కాదు, మహిళలందరినీ అవమానించినట్టే అన్నారు. మహిళల రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం రాజకీయ విమర్శ కాదని అది మహిళల గౌరవాన్ని కించపరచడమే అని మండిపడ్డారు. ఒక మహిళను ఆమె రూపాన్ని బట్టి కాదు, ఆమె పనితీరు, సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలని సూచించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరమన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే విధానాలపై చర్చించాలి గానీ, వ్యక్తిగత దూషణలకు దిగకూడదని హితవు పలికారు. ఇలాంటి వ్యాఖ్యలు మరింత మంది మహిళలు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తిని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. గుడివాడ అమర్నాథ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పెట్టుబడులకు గమ్యస్థానం ఏపీ

మొదటి పేజీ తరువాయి...

అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించిందని వెల్లడించారు. రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతమని స్పష్టం చేశారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఏపీని మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని చెప్పుకొచ్చారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని తెలిపారు. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని.. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని ప్రస్తావించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తోందని తెలిపారు. ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలని చెప్పుకొచ్చారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతలను సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్సిటీలు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని.. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయని చెప్పుకొచ్చారు. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# బీసీలపై గొడ్డలి పార్టీ కక్ష

మొదటి పేజీ తరువాయి...

హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. ఈరోజు(మంగళవారం) అమరావతి వేదికగా మీడియాతో కొల్లు రవీంద్ర మాట్లాడారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

# టెలిగ్రామ్‌పై తాత్కాలిక బ్యాన్

మొదటి పేజీ తరువాయి...

ఫీచర్‌ను జూన్ 30 వరకు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం తీసుకున్న ఈ చర్యలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ స్వాగతించింది. పరీక్ష భద్రత, విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

**పేపర్ లీక్ పేరుతో భారీ మోసాలు**

గత కొన్ని వారాలుగా PAPER LEAKED NEET, Re-NEET 2026, Private Mafia, REE NEET MAFIAAµ వంటి పేర్లతో టెలిగ్రామ్‌లో పలు ఛానళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. రీ-ఎగ్జామ్ ప్రశ్నాపత్రం తమ వద్ద ఉందంటూ విద్యార్థులు, వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఎన్టీఏ వెల్లడించింది. ప్రశ్నాపత్రం అందిస్తామంటూ కొందరు అభ్యర్థుల నుంచి వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు గుర్తించారు. అయితే పరీక్ష ప్రశ్నాపత్రం పూర్తిగా భద్రతా వ్యవస్థలోనే ఉందని, పరీక్షకు ముందు ఎవరూ లీక్ చేయలేని విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్టీఏ స్పష్టం చేసింది. పేపర్ లీక్ అయ్యిందంటూ వస్తున్న ప్రచారాలన్నీ పూర్తిగా నకిలీవేనని పేర్కొంది. టెలిగ్రామ్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్ ద్వారా ఇప్పటికే పంపిన సందేశాలను తర్వాత సవరించే అవకాశం ఉంటుంది. కొన్ని ముఠాలు ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ, పరీక్ష పూర్తయిన తర్వాత అసలు ప్రశ్నాపత్రాన్ని పాత సందేశాల్లో జతచేసి, పరీక్షకు ముందే పేపర్ లీక్ అయినట్లు తప్పుడు ఆధారాలు సృష్టిస్తున్నట్లు ఎన్టీఏ తెలిపింది. ఈ తరహా మోసాలను అడ్డుకునేందుకే జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను సైతం నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (×4సీ), కేంద్ర హోంశాఖ, రాష్ట్ర పోలీసు శాఖలు కలిసి ఈ మోసాలపై ఇప్పటికే చర్యలు చేపట్టాయి. బీహార్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల పోలీసుల నుంచి వచ్చిన సమాచారంతో పలు టెలిగ్రామ్ ఛానళ్లు, గ్రూపులు, బాట్లను తొలగించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అంతర్రాష్ట్ర సైబర్ మోసగాళ్ల ముఠాను అరెస్ట్ చేయగా, వారు సుమారు రూ.1.5 కోట్ల మేర అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు.

**నీట్ అభ్యర్థులకు ఎన్టీఏ సూచనలు**

జూన్ 21న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని ఎన్టీఏ స్పష్టం చేసింది. విద్యార్థులు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా ప్రశ్నాపత్రం తమ వద్ద ఉందని, డబ్బు చెల్లిస్తే దాన్ని మీకు అందిస్తామంటూ సంప్రదిస్తే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎన్టీఏ కోరింది. పరీక్షలను నిష్పక్షపాతంగా, భద్రంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చింది. వ్యక్తిగతంగా, టెలిఫోన్ ద్వారా లేదా ఏదైనా ఆన్‌లైన్ వేదిక ద్వారా మోసపూరిత సందేశాలు అందితే వెంటనే జాతీయ సైబర్-క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబరుకు గానీ, లేదా ఝఎవతీఝతీఅఎవ.స్త్రశీజ.ఱఅ లోని జాతీయ సైబర్-క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా గానీ ఫిర్యాదు చేయాలని తెలిపింది. దీనితోపాటు చీూా వారి సొంత హెల్ప్‌లైన్‌లు 011-40759000 / 011-69227700 నంబరులను సంప్రదించవచ్చు. లేదంటే neetug@nta.ac.in కూడా మెయిల్ చేయవచ్చని సూచించింది.



## జ్ఞానేశ్వరి కోసం
# దర్యాప్తు ముమ్మరం

**గాలింపు చర్యలు ముమ్మరం**

**పెద్దాపురం డిఎస్పీ తిలక్ వెల్లడి**

**(కాకినాడ - జయజయహే)**

కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి కేసుపై పెద్దాపురం డీఎస్పీ తిలక్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంగళవారం డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడారు. 35 నిమిషాల వ్యవధిలో బాలిక మిస్సయిందని చెప్పుకొచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి సమాచారం తెలిసిన వెంటనే గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. జీడీ పిక్కలు ఏరుకునే వారిని కూడా పిలిచి చిన్నారి గురించి విచారించామని తెలిపారు. పాప మిస్సయిన చోట బొమ్మలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారికి సంబంధించి తప్పుడు వార్తలను ప్రచురించే వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తిలక్ హెచ్చరించారు. పాపను జంతువులు తీసుకెళ్లాయనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. జీడి పిక్కలను ఏరుకునే సంచార జాతుల వారిపై నిఘా పెట్టి విచారణ చేస్తున్నామని తెలిపారు. చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబం పెంచుకుంటున్న కుక్కకు నాలుగు రోజులుగా ఎలాంటి ఆహారం లేకపోవడంతోనే చనిపోయిందని వెల్లడించారు. కుక్క పోస్టుమార్టం రిపోర్టు రెండు రోజుల్లో వస్తుందని డీఎస్పీ తిలక్ పేర్కొన్నారు.

# డ్రగ్ పెడ్లర్స్ నెట్ వర్క్

మొదటి పేజీ తరువాయి...

ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఒకేసారి ప్రత్యేక దాడులు చేపట్టిన అధికారులు డ్రగ్స్, గంజాయి వినియోగిస్తున్న 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌ను బలహీనపరచడంతో పాటు డిమాండ్‌ను తగ్గించడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. పట్టుబడిన వారిలో 14 మందికి గంజాయి వినియోగించినట్లు పరీక్షల్లో నిర్ధారణ కాగా, మరో వ్యక్తికి గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాల వినియోగం కూడా పాజిటివ్‌గా తేలింది. విచారణలో భాగంగా అందరూ డ్రగ్స్ వినియోగించిన విషయాన్ని అంగీకరించినట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. అనంతరం వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు వెల్లడించింది. కాగా, దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతంలో హాస్టల్‌ను కేంద్రంగా చేసుకుని ఓ ముఠా కొకైన్, ఎండీఎంఏ , ఎల్ఎస్డీ , హ్యాష్ ఆయిల్ వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ గుర్తించింది. బెంగళూరు, గోవా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా జరుగుతున్నట్లు సాంకేతిక విశ్లేషణలో తేలిందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, ఈ మాదకద్రవ్యాలను సినీ పరిశ్రమకు చెందిన కొంతమందికి కూడా విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. టెక్నికల్ అనాలిసిస్ ద్వారా మొత్తం 44 మంది డ్రగ్స్ వినియోగదారులను అధికారులు గుర్తించారు. వీరిలో హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రధాన డ్రగ్ పెడ్లర్లు నగరంలో అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులపై దృష్టి సారించి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు ఈగల్ ఫోర్స్ పేర్కొంది. ఇందుకోసం 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమన్వయంతో దాడులు నిర్వహించినట్లు తెలిపింది. విచారణలో మరో కీలక అంశం బయటపడింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డి పేర్లపై ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ.3.13 లక్షలకు పైగా బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. చక్రపాణి, హర్షిత్ రెడ్డి ఇప్పటికే 2019లో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయిన నిందితులేనని పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించేందుకు దర్యాప్తును మరింత విస్తరించినట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ఇటువంటి ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# తెలంగాణ గడ్డకు పవన్

మొదటి పేజీ తరువాయి...

ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్.. ఆయన్ను, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ రేపు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, పవన్ కళ్యాణ్‌కు మధ్య తీవ్రమైన వాగ్వాదం నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జనసేన నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు, హైకోర్టు అనుమతి నిరాకరించడం వివాదానికి కేంద్ర బిందువైంది. దీనిపై జూబ్లీహిల్స్ నివాసంలో ప్రెస్ మీట్ పెట్టిన పవన్.. తెలంగాణ ఎవరి సొంత జాగీరు కాదు.. నన్ను హైదరాబాద్ రాకుండా ఆపేదెవరు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ఢిల్లీ వేదికగా జరిగిన పార్టీ సేన ప్రస్థానం' సమావేశంలోనూ.. తెలంగాణ అమరవీరులను గుర్తించడానికి ఈ పాలకులకు 12 ఏళ్లు సరిపోలేదా అంటూ కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ కేవలం అభిమాని నిరంజన్‌ను కలిసి వెళ్ళిపోయినా.. ప్రస్తుతమున్న పొలిటికల్ టెన్షన్స్ దృష్ట్యా దానికి రాజకీయ ప్రాధాన్యత లభించడం ఖాయం. ఢిల్లీ వేదికగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర విభజన సరిగ్గా జరగలేదని పవన్ మాట్లాడటాన్ని, తెలంగాణ సెంటిమెంట్‌ను తక్కువ చేసి చూపడంగా కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని తాము అడ్డుకుంటామని ఇప్పటికే కొంతమంది ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి పవన్ పర్యటించే నియోజకవర్గం లేదా రూట్ మ్యాప్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు తెలిపే లేదా అడ్డుకునే ప్రయత్నాలుఉన్నాయని భావిస్తున్నారు. ఈ పర్యటన కేవలం ఒక అభిమానిని కలవడం కోసమే కాబట్టి ఎలాంటి రాజకీయ ప్రసంగాలు ఉండకపోవచ్చని జనసేన వర్గాలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో పవన్ వస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం ప్రోటోకాల్ ప్రకారం భద్రత కల్పించాల్సి ఉంటుంది.

# దగ్గు సిరప్‌పై కేంద్రం కొరడా

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940లోని సెక్షన్లు 12, 33 ప్రకారం లభించిన అధికారాలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం ఈ సవరణలు చేసింది. ఈ కొత్త నిబంధనలు అధికారిక గెజెట్‌లో ప్రచురితమైన తేదీ నుండి అమలులోకి వస్తాయి. డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ కె లోని ఐటమ్ నంబర్ 7 (క్లాస్ ఆఫ్ డ్రగ్స్) నుండి 'సిరప్స్' అనే పదాన్ని తొలగించారు. ఇప్పటివరకు ఈ షెడ్యూల్ కింద ఉన్న మందుల తయారీ, విక్రయాలు, పంపిణీకి కొన్ని ప్రత్యేక నిబంధనల నుండి మినహాయింపులు ఉండేవి. తాజా సవరణతో దగ్గు సిరప్‌లు ఓవర్-ది-కౌంటర్ మందుల హోదాను కోల్పోయాయి. కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసిన 'నేషనల్ ఫార్ములరీ ఆఫ్ ఇండియా 2026' ముసాయిదా ప్రకారం, రెండేళ్ల లోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ సిఫార్సు చేయకూడదని, మెడికల్ షాపుల వారు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఐదేళ్ల లోపు పిల్లలకు కూడా అత్యవసర వైద్య పరిస్థితి ఉంటే తప్ప,




ఇలాంటి మందులను వాడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ వాడినా వైద్యుల పర్యవేక్షణలోనే వాటిని ఉపయోగించాలని నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో కల్తీ దగ్గు సిరప్ తాగి పలువురు చిన్నారులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. మధ్యప్రదేశ్‌లో 12 మంది, రాజస్థాన్‌లో మరికొందరు పిల్లలు ప్రాణాలు కోల్పోవడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర ఆరోగ్య శాఖకు, నియంత్రణ సంస్థలకు నోటీసులు జారీ చేసి తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. "చిన్నారుల మరణాలు ఔషధాల భద్రత, నియంత్రణ, పర్యవేక్షణలో ఉన్న తీవ్రమైన లోపాలను స్పష్టం చేస్తున్నాయి. ఇది ప్రజల జీవించే హక్కును, ఆరోగ్య హక్కును ఉల్లంఘించడమే" అని జాతీయ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 19 93 నిబంధనల ప్రకారం ఎన్‌హెచ్ఆర్సీ సభ్యుడు ప్రియాంక్ కానూంగో నేతృత్వంలోని బెంచ్ ఈ విచారణకు ఆదేశించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు తక్షణమే విచారణ జరిపించాలని ఆదేశించారు. అనుమానాస్పద దగ్గు సిరప్ శాంపిల్స్ సేకరించి పరీక్షించాలని, నకిలీ లేదా నాణ్యత లేని మందుల అమ్మకాలను అడ్డుకోవడానికి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం సిరప్‌ల విక్రయాలపై కఠినమైన నిబంధనలు తీసుకువచ్చింది.

# హోం మంత్రికి అధికార మదం..!

### అందుకే మాజీ మంత్రి అమర్‌నాథ్‌పై ప్రేలాపనలు

### ఆ వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలి

### విజయమ్మ, భారతమ్మ, వైఎస్ జగన్‌లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి డిమాండ్

**విశాఖపట్నం, జూన్ 16, జయ జయహే :**

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికార మదంతో హద్దులు దాటి మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం మద్దిలపాలెం లో గల వైస్సార్సీపీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత కల్పించాల్సిన హోం మంత్రి తన బాధ్యతలను పూర్తిగా విస్మరించి, ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత



విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ "వాడు, వీడు" అంటూ మాట్లాడటం అనిత అహంకారానికి నిదర్శనమన్నారు. మహిళలను గౌరవంగా "అమ్మ" అని సంబోధించే అమర్‌నాథ్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమె రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నా వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైన అనిత, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్‌సీపీపై విమర్శల దాడికి దిగుతున్నారని ఆరోపించారు. హోం శాఖలో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అనిత ఇలాంటి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు."అందరినీ తప్పుగా మాట్లాడి, మా పార్టీ నాయకుడు జగన్ ను 'వాడు, వీడు' అని సంబోధించి, మాజీ మంత్రులను కూడా అదే విధంగా అవమానించి, మా భారతమ్మ, విజయమ్మని సైతం గౌరవం లేకుండా మాట్లాడారని, అలాంటి వ్యాఖ్యలకు మా పార్టీ నుంచి కౌంటర్ వస్తే మాత్రం నిస్సిగ్గుగా దళిత కార్డు వాడుతున్నారన్నారు. దళితుల కోసం నిజంగా ఏమీ చేయని మీకు దళిత కార్డు వాడే నైతిక హక్కు లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం దళితుల పేరును ఉపయోగించడం మానుకోవాలని మండిపడ్డారు. అంతేకాకుండా అమర్‌నాథ్‌పై విమర్శలు చేయడంలో దళిత కార్డును అడ్డంగా ఉ పయోగించుకోవడం అనిత రాజకీయ అవకాశవాదానికి పరాకాష్టగా పేర్కొన్నారు. సమాజంలోని వర్గాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, కేవలం హోంమంత్రి అనే అధికార మదంతో ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



## కళ్యాణ వెంకన్న ఉత్సవాల పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే

**మాడుగుల, జూన్ 16, జయ జయహే**

25 నుంచి ప్రారంభం కానున్న మాడుగుల మండలం కేజే పురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు పోస్టర్ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం జాలంపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డు ప్రారంభించిన తర్వాత శ్రీ కళ్యాణవెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం పోస్టర్ లు, కరపత్రం లను దేవాలయం వ్యవస్థాపక చైర్మన్, ధర్మకర్త, రాపేటి రామకొండారావు మాస్టర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు , ఎండి ఓకే అప్పారావు, ఎస్ఐ నారాయణరావు, టిడిపి నాయకులు ఉ ఒడూరు దేముడు, నందారపు సన్యాసి రావు,పుప్పాల రమేష్, పల్లా శ్రీను, బాణం భీమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## డా. ప్రవీణ్ పుల్లటకు జాతీయ స్థాయి గుర్తింపు

**ఇచ్ఛాపురం , జూన్ 16:(జయ జయహే)**

ఆయుర్వేదం మరియు వెల్ నెస్ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నివమ్ వెల్ నెస్ సంస్థకు ప్రతిష్ఠాత్మక "ఇండియాస్ లీడింగ్ ఆయుర్వేద అండ్ వెల్నెస్ బ్రాండ్ అవార్డ్ " లభించింది. అహ్మదాబాద్‌లోని హయత్ రీజెన్సీ హోటల్‌లో నిర్వహించిన ఈ టి బిజినెస్ కాంక్లేవ్ అండ్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో మంగళవారం ఈ అవార్డును ప్రదానం చేశారు. వెల్‌నెస్ అండ్ హెల్త్‌కేర్ విభాగంలో టైమ్స్ నెట్వర్క్ అందించిన ఈ అవార్డును రైజ్ వెల్నెస్ ప్రై. లిమిటెడ్ సంస్థ తరఫున రైజ్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రవీణ్ పుల్లట స్వీకరించారు. ఈ కార్యక్రమానికి గుజరాత్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంకా గుజరాత్ అటవీశాఖ మంత్రి అర్జున్ భాయ్ కూడా హాజరై అవార్డులు అందుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయుర్వేదం, ప్రివెంటివ్ హెల్త్‌కేర్ మరియు హోలిస్టిక్ వెల్‌నెస్ రంగాల్లో నివమ్ వెల్నెస్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగానే ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని డా. ప్రవీణ్ పుల్లట తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న సీఈవో రమ్య వడ్లమాని, ఇతర సిబ్బంది, వినియోగదారులు మరియు వైద్య నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు.



## పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం

**మాడుగుల జూన్ 16 జయ జయహే**

మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాశీ అధ్యక్షతన, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొంకి అప్పారావు ఆధ్వర్యంలో జీపీడీపీ,బిపిడిపి (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక,బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ) పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా మండలం లో పనిచేస్తున్న పంచాయతీ అభివృద్ధి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్ లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, వెలుగు విఓ లు, సి.సి లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 16 ఆర్థిక సంఘం నిధులు ఏ విధంగా ఖర్చు ఖర్చు చేయాలి, ఎలా ఖర్చు చేయాలి, ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎంత వంటి వాటితో పాటు ప్రభుత్వం జారీ చేసిన నూతన విధి విధానాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫిసర్ జి. గోపాలరావు మరియు డిప్యూటీ యమ్.పి.డి.ఓ గౌరిశంకర్ పాల్గొన్నారు.

## జులై మూడో వారంలో తల్లికి వందనం

మొదటి పేజీ తరువాయి...

మధ్య తరగతి వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో ఇంటింటా ఆనందం విరిసేలా 'తల్లికి వందనం' పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. పిల్లల చదువుకు ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో దీన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాకు రూ. 13,000లు, పాఠశాల అభివృద్ధికి రూ.2000ల చొప్పున మొత్తం రూ.15,000ల నగదు నేరుగా జమ చేస్తోంది. అలాగే ఏడాదిలో నటటలకు కరెంట్ వినియోగం సగటున 300 యూనిట్లలోపు ఉండాలి. పురపాలిక పరిధిలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థిరాస్తిని కలిగి ఉండకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ తర్వాత పెన్షన్ పొందేవారు ఈ పథకానికి అనర్హులు. పారిశుద్ధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తే ఈ పథకం వర్తించదు. లబ్ధిదారులు రాష్ట్ర గృహ డేటాబేస్‌లో ఉండాలి. గతేడాది ఆంధ్రప్రదేశ్ తల్లికి వందనం పథకం కింద 67,27,164 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించి రూ.8,745 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మరోవైపు రాష్ట్రంలో నాలుగు రోజుల క్రితమే పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో తల్లికి వందనం గురించి లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దీనిపై ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. జులై మూడో వారంలో తల్లికి వందనం ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే ఈ పథకంలో పిల్లల పేర్లు జాబితాలో ఉన్నదీ? లేనిదీ? ముందే తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సచివాలయాల్లో జాబితాలు ఉంటాయని, అక్కడకు వెళ్లి చెక్ చేసుకోవచ్చని చెబుతున్నారు. లేదంటే ఆన్‌లైన్‌లోనూ చెక్ చేసుకునే సదుపాయం ఉందని వివరిస్తున్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

**మాడుగుల జూన్ 16 జయ జయహే**

మాడుగుల మండలం పరిధిలో గల వీధి గ్రామాల్లో కోటి 70 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం ప్రారంభించారు. దాంట్లో భాగంగా జాలంపల్లి గ్రామంలో 75 లక్షల రూపాయలతో, జంపెన గ్రామంలో 20 లక్షలు రూపాయలతోనూ, డి గొటివాడ గ్రామంలో 20 లక్షలు రూపాయలతో, శంకరం గ్రామంలో 20 లక్షలు రూపాయలతో,ఏం కోడూరు గ్రామంలో 34 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి



ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంఖ్యామానికి పెద్దపేట వేస్తుందని, ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లు, కాలువలు, మంచినీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తుందని దానిలో భాగంగానే ఈరోజు కోటి 70 లక్షల రూపాయలతో నిర్మించిన వివిధ రహదారులను ప్రారంభించుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాలంపల్లి పంచాయతీ ఎలక్షణాపురం గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసి వాటిని సత్యమే మర్చిపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే రమాదేవి, ఎండిఓకే అప్పారావు తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, మండల పార్టీ నాయకులు ఎన్ సన్యాసిరావు, పి రమేష్, వడ్డే రాజ్ కుమార్, బాణం భీమన్న దొర,ఉ ఒడూరు దేవుడు, సూర్యనారాయణ, ఎం అర్జునరావు, పల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో నంది అవార్డులు

### విధివిధానాల చర్చ... రూట్ మ్యాప్ ఖరారు

### ఫిలం డవలప్మెంట్ కార్పొరేషన్ నిర్ణయం

**(అమరావతి - జయజయహే)**



రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం ముందడుగు వేసింది. ఈ మేరకు నూతన పాలకవర్గం తొలి బోర్డు సమావేశం సోమవారం విజయవాడ ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్నిఏపీఎఫ్ టీడీసీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్ తెలిపారు. ఈ సమావేశానికి కార్పొరేషన్ ఛైర్మన్ పి. భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, డైరెక్టర్లు వై. ఝాన్సీ, సుమన్ తల్వార్, ఎస్. శివాజీ, చదలవాడ శ్రీనివాసరావు, బుర్రా సాయి మాధవ్, కందిమళ్ల సాంభశివరావు, వివేక్ కూచిభొట్ల, వి. సముద్ర, కే. ఉమామహేశ్వరరావు, ఎస్. వెంకట కృష్ణా రెడ్డి, జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణ, దుర్గా ప్రసాద్ సాహులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే పలు ఆసక్తికర నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగాల సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో పరిశ్రమ పురోగతికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బోర్డు డైరెక్టర్ల సభ్యుల్లో ఒకరు చిక్కాల మెహర్ రమేష్ కుమార్ ను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేశామన్నారు. బోర్డు సమావేశానంతరం ఈజీఎమ్ మీటింగ్ లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ, చిత్రీకరణకు అనుకూల వాతావరణం కల్పించడం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ (రూట్ మ్యాప్) రూపొందించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులు, భవిష్యత్తులో నిర్వహించాల్సిన నంది అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివిధ అంశాలు, విధివిధానాలు, సూచనలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేయడంతో పాటు కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు ప్రోత్సాహం అందించేలా కార్పొరేషన్ కార్యాచరణ కొనసాగుతుందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తెలియజేశారు. ఈ సమావేశంలో ఏ.పి. ఫిలిం, టెలివిజన్ , నాటకరంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముడావత్ శ్రీనివాస్ నాయక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# హోం మంత్రి అనిత సంస్కార హీనురాలు

### పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసారు

### అమిత్ షా తో చీవాట్లు తినడం వాస్తవం కాదా

### రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిరెచశాయి

### వైసీపీ ఎమ్మెల్సీ వరదు కల్యాణి మండిపాటు

**(విశాఖపట్నం - జయజయహే)**

కూటమి పాలనలో పోలీస్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి, ఖాకీ దుస్తులను ఎల్లో యూనిఫామ్‌గా మార్చేశారని వైయస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖపట్నంలోని వైయస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నిత్యం 70 మంది మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా.. క్రైమ్ రేట్ తగ్గిందంటూ హోంమంత్రి అనిత అధికారుల సమక్షంలో పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని తేల్చి చెప్పారు. చట్టాల అమల్లో ఏపీ దేశంలోనే 36వ స్థానానికి పడిపోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేత చీవాట్లు తిన్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన



మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగుతూ హోంమంత్రి తన సంస్కారహీన భాషను ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తిట్ల పురాణం మానేసి.. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, లైంగిక వేధింపుల నిందితుడు ఆదిమూలం, గర్భస్రావానికి కారణమైన జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఏ రాష్ట్రంలోనైనా అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయడం పోలీసుల విధి. కానీ ఏపీలో మాత్రం కూటమి ప్రభుత్వ 'రెడ్ బుక్ రాజ్యాంగాన్ని' అమలు చేయడానికి పోలీసులను వాడుకుంటున్నారు. పోలీసుల ఖాకీ దుస్తులను 'ఎల్లో యూనిఫామ్'గా మార్చిన ఘనత చంద్రబాబుదే. ఐపీఎస్ కాస్తా కూటమి పాలనలో 'ఇండియన్ పొలిటికల్ పనిష్మెంట్ సర్వీస్' గా.. ఏపీపీఎస్ కాస్తా 'ఏపీ పొలిటికల్ రివేంజ్ సర్వీస్' గా మారిపోయాయి. దేశవ్యాప్తంగా కేంద్రం తెచ్చిన 'బీఎన్ఎస్' చట్టాలను ప్రజల కోసం వాడుతుంటే, ఏపీలో మాత్రం వాటిని నిర్వీర్యం చేసి 'బాబు రాజకీయ న్యాయసంహిత చట్టాలు' గా మార్చివేశారు. పోలీసు బెల్టుపై ఉండే మూడు సింహాలు న్యాయం, చట్టం, నీతికి ప్రతీకలు. కానీ నేడు ఆ మూడు సింహాలను మూడు కూటమి పార్టీలకు తొత్తులుగా, కీలుబొమ్మలుగా మార్చేశారు అని వరదు కల్యాణి మార్చేసారు. హోంమంత్రి అనిత ఇప్పటికైనా తిట్ల పురాణం మానేసి శాంతిభద్రతల అమలుపై, మహిళా రక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. లేనిపక్షంలో పాలనలో విఫలమైన అసమర్థ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, విఫల హోంమంత్రిగా అనిత చరిత్రలో మిగిలిపోతారని, ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హెచ్చరించారు. నియోజక వర్గం పరిశీలకులు పెడాడ రమణి కుమారి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి స్వాతి దాస్, మాజీ కార్పొరేట్లు శశికల, మువ్వల లక్ష్మి , సాది పద్మావతి (పద్మారెడ్డి), మాజీ డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పళ్ళ చిన్న తల్లి , పార్టీ నాయుకురాలు మల్లా దేవి విశాలక్ష్మి, పతివాడ వెంకట లక్ష్మి, రీసు అనురాధ, వనం వర లక్ష్మి, బొర్రా విజయలక్ష్మి, చుక్క వర లక్ష్మి , చెరుకూరి రజిని, కోడూరు సుశీల, దమయంతి పాల్గొన్నారు .

For a pure tomorrow.. జయహో

## వికసిత భారత్ దిశగా
# వేగంగా పయనిస్తున్న భారత్

(సి.హెచ్.ప్రతాప్)

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక మాంద్యం, ఇంధన సంక్షోభం, వాణిజ్య అస్థిరత వంటి అనేక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నీతి ఆయోగ్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు దేశ భవిష్యత్తుపై విశ్వాసాన్ని పెంచుతున్నాయి. "వికసిత భారత్" అనే లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టంగా వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడానికి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, యువత సాధికారత, మహిళా అభివృద్ధి, ఉచిత వాణిజ్య ఒప్పందాలు వంటి అంశాలు కీలకంగా మారుతున్నాయి.

భారత్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్మాణాత్మక సంస్కరణలు దేశానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తున్నాయి. తయారీ రంగ ప్రోత్సాహం, డిజిటల్ వ్యవస్థల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు దేశ వృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలతో కుదుర్చుకుంటున్న ఉచిత వాణిజ్య ఒప్పందాలు భారత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలను విస్తరిస్తున్నాయి. దీని వల్ల ఎగుమతులు పెరగడమే కాకుండా విదేశీ పెట్టుబడులు కూడా ఆకర్షితమవుతున్నాయి.

యువత భారత భవిష్యత్తు శక్తి అని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. యువతలో నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, సాంకేతిక విద్య విస్తరణ ద్వారా కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయి. ఆవిష్కరణలు, పరిశోధన, సాంకేతిక రంగాల్లో యువత ముందుకు రావడం వల్ల భారత్ ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని పెంచుకుంటోంది. యువతకు సరైన దిశానిర్దేశం, ఉపాధి అవకాశాలు కల్పిస్తే దేశం మరింత వేగంగా ఎదగగలదనే విశ్వాసం బలపడుతోంది.

వికసిత భారత్‌కు మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధే పునాది అని ప్రధానమంత్రి పేర్కొనడం అత్యంత ప్రాధాన్యమైన విషయం. వ్యవసాయం, వ్యాపారం, విజ్ఞానశాస్త్రం, ఆవిష్కరణలు వంటి అనేక రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. మహిళలకు సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించినప్పుడు కుటుంబాలు బలపడతాయి; కుటుంబాలు బలపడితే సమాజం పురోగమిస్తుంది; సమాజం పురోగమిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది. అందుకే మహిళా విద్య, ఉపాధి, భద్రత, డిజిటల్ అవగాహన వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మహిళల అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వాలు నాణ్యమైన విద్యా కార్యక్రమాలు అమలు చేయాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణను విస్తరించాలి. ఉద్యోగినుల కోసం మరిన్ని వసతి గృహాలు ఏర్పాటు చేయడం, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయడం, గ్రామీణ మహిళలకు డిజిటల్ పరిజ్ఞానం అందించడం వంటి చర్యలు కీలకం. విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు, మార్గదర్శక కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు పెంచితే మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించగలుగుతారు.

అలాగే సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయడం దేశ అభివృద్ధికి అత్యంత అవసరం. పరస్పర ఆలోచనలు పంచుకోవడం, విధానాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా అభివృద్ధి ప్రతి ప్రాంతానికీ చేరుతుంది. ప్రాంతీయ సమస్యలను సమిష్టిగా పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుంది. ఈ సమన్వయం సమగ్రాభివృద్ధికి దోహదపడుతుంది.

భారత్ ప్రస్తుతం ప్రపంచానికి ఆశాకిరణంగా మారుతోంది. సాంకేతికత, వ్యవసాయం, అంతరిక్ష పరిశోధనలు, ఆరోగ్య రంగాలలో సాధిస్తున్న విజయాలు దేశ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయి. గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కూడా భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. ఈ మార్పులు దేశాన్ని ఆత్మవిశ్వాసంతో కూడిన శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నాయి.

ప్రపంచ సవాళ్ల మధ్య కూడా భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగించడం దేశ సామర్థ్యానికి నిదర్శనం. సమిష్టి కృషి, మహిళా సాధికారత, యువత శక్తి, సమర్థ పరిపాలన కలిసివస్తే "వికసిత భారత్" లక్ష్యం దూరంలో ఉండదు.

# హరితాభివృద్ధి, కృత్రిమ మేధస్సు సమన్వయమే భవిష్యత్తు

(సి.హెచ్.ప్రతాప్)



**ఇరవై ఒకటవ శతాబ్దాన్ని ప్రభావితం చేస్తున్న అత్యంత శక్తివంతమైన మార్పుల్లో కృత్రిమ మేధస్సు మరియు హరిత శక్తి మార్పు ప్రధానమైనవి. ఒకవైపు ప్రపంచం కాలుష్యం, వాతావరణ మార్పులు, ఇంధన సంక్షోభం వంటి సమస్యలను ఎదుర్కొంటుంటే, మరోవైపు కృత్రిమ మేధస్సు వేగంగా ప్రతి రంగంలోకి ప్రవేశిస్తోంది. ఈ రెండు మార్పులు పరస్పర విరుద్ధాలు కావు; సమన్వయంతో ఉపయోగిస్తే మానవజాతికి అపార ప్రయోజనాలు అందించగల శక్తులు.**

కృత్రిమ మేధస్సు లేకుండా హరిత శక్తి మార్పును నిర్వహించడం కొంత సులభమై ఉండొచ్చు. అయితే అలా చేస్తే శాస్త్రీయ ఆవిష్కరణలు, ఉత్పాదకత, సామర్థ్యవృద్ధి వంటి గొప్ప అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది. విద్యుత్ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించడం, శక్తి వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతి వనరులను సమర్థంగా వినియోగించడం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావాలను ముందుగానే అంచనా వేయడం, విపత్తుల నివారణ చర్యలను వేగవంతం చేయడం వంటి రంగాల్లో కూడా ఇది ఉపయోగపడుతోంది.

వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు మరింత విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోంది. రోగాల నిర్ధారణ, ఔషధ పరిశోధనలు, గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణ వంటి అంశాల్లో ఇది సహాయకారిగా మారుతోంది. వ్యవసాయ రంగంలో వాతావరణ పరిస్థితులను విశ్లేషించి రైతులకు సూచనలు ఇవ్వడం ద్వారా దిగుబడులను పెంచుతోంది. ఈ విధంగా కృత్రిమ మేధస్సు హరితాభివృద్ధిని మరింత వేగవంతం చేసే సాధనంగా మారుతోంది.

అయితే సాంకేతికత ఎప్పుడూ మానవాళికి సేవ చేసే సాధనంగానే ఉండాలి; మనిషిని నియంత్రించే శక్తిగా మారకూడదు. నియంత్రణలేని స్వయంచాలక వ్యవస్థలు ఉద్యోగాలను తగ్గించే ప్రమాదం కలిగిస్తాయి. ముఖ్యంగా తక్కువ నైపుణ్యాలు కలిగిన కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. సంపద కొద్ది మందికే కేంద్రీకృతమైతే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. అంతేకాకుండా భారీ గణన వ్యవస్థల కారణంగా విద్యుత్ వినియోగం కూడా పెరిగే ప్రమాదం ఉంది.

కాబట్టి కృత్రిమ మేధస్సును తిరస్కరించడం సరైన మార్గం కాదు; బాధ్యతాయుతంగా వినియోగించడం మాత్రమే ఉత్తమ పరిష్కారం. ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలి. ఉద్యోగాలలో మార్పులకు అనుగుణంగా యువతను సిద్ధం చేయాలి. నైతిక ప్రమాణాలు, గోప్యత రక్షణ, సామాజిక భద్రత వంటి అంశాలపై కఠిన విధానాలు అవసరం. సాంకేతిక ప్రగతి సమాజంలోని ప్రతి వర్గానికీ ప్రయోజనం చేకూర్చేలా ఉండాలి.




కృత్రిమ మేధస్సు మనిషిని పూర్తిగా భర్తీ చేస్తుందనే భయం కూడా చాలా వరకు అపోహే. యంత్రాలు ఎంత అభివృద్ధి చెందినా మానవ సహానుభూతి, సృజనాత్మకత, భావోద్వేగ అవగాహనను పూర్తిగా అనుకరించలేవు. చరిత్ర చెబుతున్నది ఒక్కటే --- సాంకేతిక మార్పులతో పాత ఉద్యోగాలు తగ్గినా కొత్త అవకాశాలు పుడతాయి. మార్పులకు అనుగుణంగా నేర్చుకోవడమే విజయానికి మార్గం.

పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక విద్య, డిజిటల్ నైపుణ్యాలు, పరిశోధనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం అత్యవసరం. యువతలో ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచితే దేశం భవిష్యత్తు సవాళ్లను మరింత ధైర్యంగా ఎదుర్కోగలదు. గ్రామీణ ప్రాంతాలకు సాంకేతిక పరిజ్ఞానం చేరడం ద్వారా సమాన అవకాశాలు పెరిగి సామాజిక పురోగతి వేగవంతమవుతుంది.

కృత్రిమ మేధస్సు మనిషిని భర్తీ చేయదు; అయితే కృత్రిమ మేధస్సును సమర్థంగా వినియోగించగల వ్యక్తి మాత్రం మరొకరిని అధిగమించే అవకాశం ఉంది. అందుకే భవిష్యత్తు కోసం మనుషులు నిరంతరం కొత్త నైపుణ్యాలను అలవరచుకోవాలి. మానవ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలను సమతుల్యంగా మిళితం చేసినప్పుడే సమానత్వంతో కూడిన శ్రేయోభిలాషి ప్రపంచాన్ని నిర్మించగలం.

# ధూమావతి ఆరాధన......!!

## ఏ సమస్య అయినా నేను చేట, చీపురుతో తుడి చేస్తాను...!!!

(పుట్టా శ్రీనివాసరావు)




ధూమావతి ఈ తల్లి ఒక దైవ స్వరూపం. ఈ తల్లి ఆరాధన ఎన్నో రకాల చెడు కర్మలకు గొప్ప పరిహార సాధన ,ఈ తల్లిని అనేక రకాల జబ్బులను దూరం చేస్తుంది, గ్రహ దోషాలను తొలగిస్తుంది, కవిత్వం సిద్ధిస్తుంది, ముఖ్యంగా వ్యాపార రంగంలో నష్టపోయి అప్పులలో కూరుకుపోయి దిక్కుతోచని దౌర్భాగ్య స్థితినుండి రక్షిస్తుంది, ఉపాసకుడి యొక్క దురదృష్టాన్ని ఆమె చేతిలో ని చేట చీపురతో ఊడ్చుకొని పోతుంది ఈమె సాధన సిద్ధించి ఈ తల్లి అనుగ్రహిస్తే వారి జీవితంలో లోటు ఉండదు..

**ఏమని కోరుకొని సంకల్పించాలి**

ఒక ముఖ్యమైన విషయం గుర్తు పెట్టుకోవాలి ఈమెను ఏది కావాలి అని అడగకూడదు డబ్బు కావాలి ఉద్యోగం కావాలి ఇలా ఏది కూడా అడగకూడదు.. నా సమస్యలు పోవాలి నా బాధలు తొలగిపోవాలి నా అప్పుల బాధలు కోర్ట్ సమస్యలు పోవాలి... మానసిక ఆందోళన తొలగి పోవాలి.. వివాహ దోషం పోవాలి, గర్భ దోషం పోవాలి ,ఇలా ఏదైతే మీకు బాధ కలిగిస్తోంది అది మీకు దూరమైపోవాలి అని కోరుకుంటే నే ఈమె కరునిస్తుంది ఈ సాధన ఫలిస్తుంది. ఈ ఉపాసన ఎప్పుడు రాత్రి సమయంలోనే చేయాలి అప్పుడే ఫలితం ఉంటుంది.రాత్రి 11 గం మొదలు పెట్టాలి ఈ క్రింద ఇచ్చిన మంత్రాన్ని 21 సార్లు గాని 51 సార్లు కానీ 108 సార్లు ఇలా ఎదో ఒక సంఖ్య ని నిర్ణయించుకుని ఒకే సమయంలో రోజూ మొదలు పెట్టాలి..

ఈ జపం రెండు విధాలుగా సాధన చేస్తారు మొదటి పద్ధతి రోజు ఇన్నిసార్లు అని నియమించుకుని పదివేలు జపం చేస్తే ఈ మంత్రం సిద్ధిస్తుంది సమస్యలు తగ్గిపోతుంది. తర్వాత ఏ సమస్య రాకుండా మనసులో ఈ మంత్రాన్ని జపించుకోవచ్చు

ఇంక రెండో పద్ధతి ఈ మంత్రాన్ని రోజూ రాత్రి 11 గంటలకు 108 సార్లు జపం చేస్తూ 41 రోజులు చేస్తారు ఇలా చేసిన మీ సమస్య తీరిపోతుంది. ఫోటో ఉండాల్సిన పని లేదు నివేదన పెట్టి చేయాలని నియమం లేదు శుభ్రంగా ఉన్న ఎక్కడైనా కూర్చుని ఈ శ్లోకం జపించవచ్చు అయితే భక్తిగా చేయాలి.. ఈ సాధన చేస్తున్న వారు రోజు ఉదయం మీ మనసులో సమస్య తలుచుకుని కాకులకు అన్నం పెడితే మంచిది. మీ జపం 41 రోజులు పూర్తి అయినా, లేక పది వేల జపం పూర్తి అయిన తర్వాత పెద్దవయసు ఉన్న భర్త లేని వృద్ధురాలు పేద వారు అయిన ఒక స్త్రీ ని ఆ తల్లిగా భావించి చీర పండ్లు దక్షణ, ఇవ్వాలి.. మీకు ఉన్న అన్ని సమస్యలో ఒక్కోటి జపం చేస్తుండగానే తీరుతూ వస్తుంది.. మొండిగా ఉన్న పిల్లల కోసం. కూడా తల్లితండ్రులు రాత్రి ఈ శ్లోకమ్ 21 మారు చదివి ఉదయం పిల్లలో ఉన్న మొండితనం కోపం తీసుకుని పో అని చెప్పి కాకికి అన్నం పెడుతూ ఉంటే పిల్లలోను మంచి మార్పు వస్తుంది.

ఈ సాధన చేస్తున్న వారికి ఎన్నో నిదర్శనలు తెలుస్తూ ఉంటుంటాయి దానికి బయపడకూడదు కలలో విచిత్ర ఆకారంలో కనిపిస్తారు.. జపం చేసే ప్రాంతంలో తీవ్రమైన దుర్వాసన వస్తుంది ఒక్కోసారి, అప్పుడు జపం అపకూడదు కలలో ఎవరో చావగొట్టినట్టు కనిపిస్తుంది.. మీరు ఆ తల్లికి ఒక్కటే సంకల్పంగా చెప్పుకోవాలి నా సమస్యలు తీసుకొనిపో నా దుక్కాన్ని తీసుకుని పో అని అదే కోరుకోవాలి.. అవన్నీ పోతే మీకు సంతోషం వస్తుంది..

విధవరాలు రూపంలో ఉన్న ఈ తల్లి కూడా పార్వతీ స్వరూపం ఈమె చూడటానికి ఇలా ఉన్నా సకల సౌభాగ్యాలు అనుగ్రహిస్తుంది..ఈమెను ఉపాసించే ఆడవాళ్లకు వైధవ్యం కలగదు అనారోగ్యంతో ఉన్న భర్త జబ్బుని తీసుకుని పో అని ఈమెకు జపం చేయాలి. అలాగే ఈ సాధన స్త్రీలు పురుషులు ఎవరైనా చేయవచ్చు.. ఇందులో బీజ మంత్రాలు మూల మంత్రాలు లేవు కనుక ఉపదేశంతో అవసరం లేదు. స్త్రీలు ఆటంకం సమయంలో ఆపి తర్వాత కొనసాగించాలి.

**సౌభాగ్యదాత్రీ ధూమావతీ కవచమ్**

ధూమావతీ ముఖం పాతు ధూం ధూం స్వాహాస్వరూపిణీ ।
లలాటే విజయా పాతు మాలినీ నిత్యసున్దరీ ॥
కళ్యాణీ హృదయం పాతు హసరీం నాభి దేశకే ।
సర్వాంగం పాతు దేవేశీ నిష్కలా భగమాలినీ ॥
సుపుణ్యం కవచం దివ్యం యః పఠేద్భక్తి సంయుతః ।
సౌభాగ్యమతులం ప్రాప్య జాతే దేవీపురం యయౌ ॥
॥ శ్రీ సౌభాగ్య ధూమావతీకల్పోక్త ధూమావతీ కవచమ్ ॥

రాత్రి 11 గంటల తర్వాత ఈ మంత్రం పాఠించాలి
సర్వేజనా సుఖినోభవంతు!!

## కూరగాయల ప్రత్యేకత విశిష్టత తెలుసుకుందాం

### నేడు కూరగాయల దినోత్సవం

(పుట్టా శ్రీనివాసరావు)



కూరగాయలు ప్రకృతి మనకు అందించిన అత్యంత ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు. ప్రతి కూరగాయలో దాగి ఉన్న ప్రత్యేక పోషక విలువలు వాటి విశిష్టత ఒకసారి తెలుసుకుందాం కూరగాయలు ప్రకృతి మనకు అందించిన అత్యంత ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు. ప్రతి కూరగాయలో ప్రత్యేక పోషక విలువలు దాగి ఉన్నాయి.

**ముఖ్య ప్రత్యేకతలు:**

కూరగాయల్లో పుష్కలంగావిటమిన్లు (ఏ సి కే బి6), ఖనిజాలు, ఫైబర్, పొటాషియం ఉంటాయి రోగనిరోధక శక్తి యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి, అంటురోగాలను నయం చేస్తాయి బరువు నియంత్రణలి ఎక్కువ ఫైబర్, తక్కువ క్యాలరీలు - బరువు పెరగడం గురించి ఆలోచించకుండా తినొచ్చు ఎముకల బలం విటమిన్ కె కాల్షియం ఎముకలను బలప్రదం చేస్తాయి

**గుండె ఆరోగ్యం**

పొటాషియం, ఫైబర్ గుండె ఆరోగ్యానికి మంచిది కొన్ని ప్రత్యేక కూరగాయలు:

–తోటకూర విటమిన్ ఏ కే బి 6, సి, ఫోలిక్ యాసిడ్ ఉంటాయి - రక్తహీనత, జీర్ణక్రియ, ఎముకల బలం కోసం మంచిది –బీట్ రూట్ విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది ఆకుకూరలు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది సంప్రదాయ దేశీయ కూరగాయలు వినియోగించడం ఆరోగ్యం మెరుగుపరచడానికి మంచిది రకరకాల కూరగాయల్ని భోజనంలో చేర్చడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి ।విటమిన్లు (ఏ సి కె బి 6), ఖనిజాలు, ఫైబర్, పొటాషియం ఉంటాయి యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి, అంటురోగాలను నయం చేస్తాయి బరువు నియంత్రణ ఎశీక్కువ ఫైబర్, తక్కువ క్యాలరీలు - బరువు పెరగడం గురించి ఆలోచించకుండా తినొచ్చు ఎముకల బలంలి విటమిన్ ఖ, కాల్షియం ఎముకలను బలప్రదం చేస్తాయి

గుండె ఆరోగ్యం పొటాషియం, ఫైబర్ గుండె ఆరోగ్యానికి మంచిది కొన్ని ప్రత్యేక కూరగాయలు: తోటకూరలి విటమిన్ ఏ , కె , బి6, సి , ఫోలిక్ యాసిడ్ ఉంటాయి - రక్తహీనత, జీర్ణక్రియ, ఎముకల బలం కోసం మంచిది –బీట్ రూట్‌లి విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది ఆకుకూరలు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది సంప్రదాయ దేశీయ కూరగాయలు వినియోగించడం ఆరోగ్యం మెరుగుపరచడానికి మంచిది రకరకాల కూరగాయల్ని భోజనంలో చేర్చడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి

# ఘనంగా ప్రారంభమైన సురభి నాటకోత్సవాలు





**విశాఖపట్నం (జయ జయహే)**

సురభి నాటకోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. కళాభారతి వేదికగా మంగళవారం సాయంత్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేడుకలను కళాభారతి కార్యదర్శి రాంబాబు, ప్రముఖ సామాజికవేత్త చెరువు రామకోటయ్య, నగర మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, లీడర్ ఎడిటర్ రమణమూర్తి, ఉత్తరాంధ్ర కళాకారుల సంఘం కార్యదర్శి వంకాయల మారుతి ప్రసాద్, జీవీఎంసీ కార్మిక నాయకులు వామన రావు ప్రారంభించారు. ఈ వేడుకలో రంగస్థలం నటులు రచయిత కొరిటాల ప్రభాకర రావు, నటులు మేడ మస్తాన్ రెడ్డి, బ్రహ్మకుమారి రమక్క,బాదంగీర్ సాయి సతీమణి హైమావతి, కార్యక్రమ నిర్వాహకురాలు శివ జ్యోతి,నాటకాల ప్రదర్శిస్తున్న భానోదయ నాట్యమండలి అధ్యక్షులు ఆర్. నాగబాబు, కార్యదర్శి ఆర్. కోటేశ్వరరావు , సమన్వయకర్త భాను ప్రసాద్, ఉపాధ్యక్షుడు మధుసూదనరావు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా సీనియర్ జర్నలిస్ట్ ఎన్ నాగేశ్వరరావు వ్యవహరించారు.

**నాటక వృత్తాంతం**

హిరణ్యకశ్యప అనే రాక్షస రాజు తన సోదరుడు హిరణ్యాక్షుడిని చంపిన విష్ణువును చంపాలని అనుకుంటాడు. హిరణ్యకశ్యపుడు బ్రహ్మదేవుడి నుండి భిన్నమైన వరం పొందాడు, అతను పగలు లేదా రాత్రి కాదు, భూమిపై లేదా నీటిలో లేదా గాలిలో ఏ ఆయుధంతో, ఏ మానవుడు లేదా జంతువుచే చంపబడడు. అటువంటి శక్తివంతమైన వరం సహాయంతో, అతను స్వర్గానికి చెందిన దేవేంద్రుడిని ఓడించి, అష్టదిక్పాలకులను (దిక్కుల ఎనిమిది మంది సంరక్షకులు) తన సేవకులుగా చేసి, తనను తాను దేవుడిగా ప్రచారం చేసుకున్నాడు.


నారద మహర్షి జోక్యంతో. హిర్ణ్యకశ్యపుని కుమారుడు పూర్వజన్మ జ్ఞానము మరియు విష్ణువు పట్ల భక్తితో జన్మించాడు. హిరణ్యకశ్యపుడు తన కుమారుడిని విష్ణువు భక్తికి దూరం చేయడానికి ప్రయత్నిస్తాడు.

హిరణ్యకశ్యపుడు తన కొడుకును ప్రేమతో మొదటగా ప్రయత్నిస్తాడు. అతను విఫలమైనప్పుడు, అతను భయంకరమైన శిక్షలతో ప్రయత్నిస్తాడు. ప్రహ్లాదుడిని కొండపై నుండి విసిరి, అగ్నిలోకి నెట్టారు, సముద్రాలలో విసిరివేయబడతారు, హింసాత్మక ఏనుగుల ముందు విసిరివేయబడతారు, వేలాడదీయబడతారు మరియు విషపూరితం చేస్తారు. కానీ ప్రహ్లాదుడు విష్ణువు అనుగ్రహంతో అన్ని శిక్షల నుండి బయటపడుతూనే ఉన్నాడు. అనేక శిక్షల తర్వాత కూడా, ప్రహ్లాదుడు విష్ణువు పట్ల తన భక్తిని వదులుకోవడానికి నిరాకరించాడు. ఒకరోజు, తన కుమారుడితో వాదనలతో అస్వస్థతకు గురై, హిరణ్యకశ్యపుడు తన కొడుకు ప్రహ్లాదుని ఎదుర్కొనేంత ధైర్యం ఉంటే విష్ణువును చూపించమని అడుగుతాడు. శ్రీమహావిష్ణువు సర్వవ్యాపి కాబట్టి ఎక్కడైనా, ప్రతిచోటా కనిపిస్తాడని ప్రహ్లాదుడు భిన్నమైన పద్ధతిలో ఆధారపడతాడు. కోపోద్రిక్తుడైన హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని తన స్వామిని ఒక స్తంభంలో చూపించమని బలవంతం చేసి, తన గదతో దానిని బద్దలు కొట్టాడు. విరిగిన స్తంభం నుండి, అద్భుతంగా, నరసింహావతార, మానవ – సింహం అవతారం బయటకు వస్తుంది. నరసింహుడు హిరణ్యకశ్యపుడిని ఎత్తుకుని, సూర్యాస్తమయం సమయంలో, రాజును తన ఒడిలో గుమ్మంపై ఉంచి, హిరణ్యకశ్యపుని కడుపులోకి తన గోళ్ళతో చంపాడు.

# హోం మంత్రిపై అమరనాథ్ వ్యాఖ్యలు దారుణం

**జనసేన నేత గురాన రాధిక**

**విజయనగరం: (జయ జయహే)**



హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై జనసేన పార్టీ విజయనగరం నాయకురాలు గురాన రాధిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరనాథ్ తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, హోం మంత్రికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు గురాన రాధిక ఒక ప్రకటన విడుదల చేస్తూ, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని, వ్యక్తిగత విమర్శలు , వ్యంగ్యాస్త్రాలు సంధించడం అత్యంత దారుణమని మండిపడ్డారు.

రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, ఒక మహిళను వ్యక్తిగతంగా అవమానించేలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసేటప్పుడు మీ ఇంట్లో ఉన్న మహిళలు కానీ, మీ సొంత పార్టీలోని మహిళా నాయకులు కానీ మీకు గుర్తుకు రాలేదా అని ఆమె నిలదీశారు.ఇదే సమయంలో ప్రభుత్వ ఆస్తులపై స్పందిస్తూ, ప్రభుత్వ వాహనాలు , బంగళాలు ప్రజాధనంతో సమకూరినవే తప్ప, ఎవరి సొంత ఆస్తి కాదనే విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తుంచుకోవాలని గురాన రాధిక స్పష్టం చేశారు. అనితపై చేసిన వ్యాఖ్యలకు గాను గుడివాడ అమరనాథ్ తక్షణమే క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు.



# గుడివాడ ఫోటోలపై గుడ్లతో దాడి

**టీడీపీ కార్యదర్శి రత్నకుమారి ఆధ్వర్యంలో తెలుగు మహిళల నిరసన**

**అనకాపల్లి, జూన్ 16, జయ జయహే :**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఫొటో పై కోడిగుడ్డులతో దాడి నిర్వహించారు. మంగళవారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ దరి పోలమాంబ గుడి జంక్షన్ లో స్థానిక తెలుగు మహిళా నాయకులు, కార్యకర్తలుతో అమర్నాథ్ ఫొటో పై గుడ్లు తో కొట్టారు. హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత మీద అనుచిత వ్యాఖ్యలు చేసి స్త్రీ జాతి తల దించుకునేట్టు చోడవరం మీటింగ్‌లో పేబ్యాచ్ తో చప్పట్లు కొట్టించుకొని వెకిలిగా నవ్వుతూ ప్రగల్భాలు పలికారని ఆరోపించారు. దళిత మహిళ, హోమ్ మినిస్టర్, విపత్తుల నిర్వహణ శాఖ మేనేజమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకురాలుగా, పాయకరావుపేట శాసనసభ్యురాలుగా మహిళా లోకం గర్వించదగ్గ స్త్రీ శక్తి గా కొనసాగుతున్నటువంటి ఆమె పై ఒక ఫెయిల్యూర్ మినిస్టర్ కేవలం పానీపూరి షాప్ నూడిల్స్ కొట్టు ఓపెనింగ్‌లకు మాత్రమే ప్రారంభించిన చేతకాని అమర్నాథ్ నోరుంది కదా అని ఆడవాళ్ల మేకప్ గురించి మట్లాడుతూ కిలోల కొలది పుట్టిలు వేసుకుని మీటింగ్ లకు వస్తున్నారని అసభ్యకరమైన వాఖ్యలు చేసినందుకు మహిళలు కి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతీయ సాంప్రదాయం పండుగలు, ఫంక్షన్ లు కి వేసుకొని కాళీకామాత కి ఇష్టమైన అలంకరణ ను ప్రతి మహిళా అలంకరణ చేసుకొని అమ్మ వారి కృప కి పాత్రులు కావాలి అని ప్రతి మహిళ ఇష్టపడుతుంది అని రత్నకుమారి తెలిపారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు

**ప్రతి కాల్‌కు సత్వర సేవలు**

**ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలి**

**ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి**

**విశాఖపట్నం, జూన్ 16, జయ జయహే**




విద్యుత్ వినియోగదారులకు సత్వర సేవలు అందించడంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కాల్ సెంటర్ పనితీరు, వినియోగదారుల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో ఏఈ లు వ్యవహరిస్తున్న తీరును ప్రత్యేకంగా పరిశీలించారు. పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కొన్ని ఫిర్యాదులపై కాల్ సెంటర్ నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరణ కోరారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు 24 గంటలూ అందుబాటులో ఉండి కాల్ సెంటర్ నెంబర్ 1912 కు వచ్చే ప్రతి కాల్‌కు తప్పనిసరిగా స్పందించాలని ఆదేశించారు. కాల్స్‌కు స్పందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించినా, వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంలో విఫలమైనా బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో ఏఈలు అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, ఆలస్యం లేదా నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని వేగంగా పరిష్కరించి వినియోగదారుల సంతృప్తిని సాధించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు, బలమైన గాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో మరిన్ని అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎండీ ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి. సూర్యప్రకాశ్, సీజీఎం పి. సోలమన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# కైలాసగిరికి మరిన్ని ఆకర్షణీయ ప్రాజెక్టులు

**వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, జూన్ 16, జయ జయహే**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విశాఖ పర్యాటక మణి హారమైన కైలాసగిరిని పర్యటక హబ్ గా తీర్చిదిద్దేలా ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, కార్యదర్శి మురళీ కృష్ణతో కలిసి కైలాసగిరిని సందర్శించారు. ఈ సందర్భంగా కైలాసగిరిపై అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. ఇక్కడ దుకాణ సముదాయం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. త్రిశూల్ వరకు వెళ్లేందుకు వీలుగా బ్యాటరీ కారు లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రపంచ ప్రఖ్యాత చెందిన నమూనాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆయన కైలాసగిరి వ్యాపారులతో సమావేశమయ్యారు. గ్లాస్ బ్రిడ్జి, త్రిశూల్ ఏర్పాటు తో కైలాసగిరి కింద పైకి వచ్చే సందర్శకుల సంఖ్య పెరిగిందని, పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా మరిన్ని ప్రాజెక్టులు రానున్నాయని పేర్కొన్నారు. అందువల్ల కైలాసగిరి కి మంచి పేరు తీసుకువచ్చేలా వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈ ఈ జే సి పి సింగ్, డి ఈ శంకర్రావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 19న విశాఖలో వికసిత రోజ్‌గార్ యోజన సదస్సు

**ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అమర్ దీప్ మిశ్రా**

**విశాఖపట్నం, జూన్ 16, జయ జయహే**




కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి వికసిత రోజ్ గార్ యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్ళడానికి దేశ వ్యాప్తంగా 200 చోట్ల వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అమర్ దీప్ మిశ్రా అన్నారు. మర్రిపాలెంలోని ఈపీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 న విశాఖ, విజయ నగరంలలో ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని, విశాఖలో సాగర్ మాల కన్వెన్షన్ సెంటర్లో ఈ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ శ్రీ భరత్ పాల్గొంటారన్నారు. ఈ పథకం వ్యవసాయ రంగం లో 3.5కోట్ల కొత్త ఉపాధి అవకాశాలు కల్పించడానికి దోహద పడుతోందని చెప్పారు. మన రాష్ట్రంలో రెండు చోట్ల ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విశాఖ విజయ నగరంలో జరిగే సదస్సులో పాల్గొని పథక ప్రయోజనాలు పొందాలని సూచించారు. ఈ పథకం ద్వారా తయారీ రంగంలో ఉపాధి పెరుగుతుందని, ప్రతి నెల 3000 రూపాయిలు అదనంగా లబ్ది పొందే అవకాశం ఉందని అన్నారు..కేంద్రం ఈ పథకం కింద లక్ష కోట్ల రూపాయలు నిర్దేశించిందని చెప్పారు.

# అరకు ఎంపీ నిధులతో నూతన బస్ షెల్టర్ ప్రారంభం

**ఎంపీపీ బడుగు రమేష్**

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జూన్ 17**



అల్లూరి జిల్లా కొయ్యురు మండలం రాజేంద్రపాలెంలో అరకు ఎంపీ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన బస్ షెల్టర్ నిర్మాణం పూర్తయిందని కొయ్యూరు మండల ఎంపీపీ బడుగు రమేష్ తెలిపారు.ఈ నెల 17న ఈ బస్ షెల్టర్ ప్రారంభోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, అల్లూరి జిల్లా అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు హాజరవుతారని ఆయన వెల్లడించారు. ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ కొయ్యూరు జెడ్పీటీసీ దివంగత వారా సూకర్రాజు జ్ఞాపకార్థంగా ఈ బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రయాణికులకు, విద్యార్థులకు ఎండ, వాన నుండి రక్షణ కల్పించేందుకు ఈ షెల్టర్ ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. వైసీపీ పార్టీ నాయకులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

For a pure tomorrow.. జయహే

# గంజాయి విక్రేతలపై పోలీసుల దాడులు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు పోలీసులు గంజాయి విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సారథ్యంలో, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో ఎస్సైలు జగన్ మోహన్ రావు, జయరాజులు తమ సిబ్బందితో కలిసి నిడదవోలు పట్టణంలోని శశి స్కూల్ రోడ్డులో ఉన్న ఓ కోళ్ల ఫారం వద్ద ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న తడాల సాయి అజయ్, షేక్ రహీమ్ అలియాస్ అజ్జు, మహమ్మద్ సలీంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, రూ.5,000 నగదు హోండా యాక్టివా స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గంజాయి కొనుగోలు చేసి వినియోగిస్తున్న కొవ్వూరుకు చెందిన విజయ్ కుమార్, నిడదవోలుకు చెందిన పవన్ కుమార్, నవీద్ అహ్మద్, చైతన్య రవితేజ, సత్య రాకేష్ అనే ఐదుగురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి, రూ.1,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నేర చరిత్రను పరిశీలించగా, మొదటి నిందితుడు తడాల సాయి అజయ్‌పై గతంలో బొమ్మూరు పోలీస్ స్టేషన్




పరిధిలో రెండు గంజాయి కేసులు, ఒక కొట్లాట కేసు నమోదై ఉన్నట్లు తేలింది. రెండో నిందితుడు షేక్ రహీమ్ అలియాస్ అజ్జుపై గతంలో పెరవలి పోలీస్ స్టేషన్‌లో ఒక గంజాయి కేసు నమోదై ఉందని పోలీసులు వెల్లడించారు. నిడదవోలు సర్కిల్ పరిధిలో గంజాయి విక్రేతలు, రవాణాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలను అక్రమంగా కలిగి ఉండటం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# 19న ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ వేడుకలు

## పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి అనే అంశంపై కార్యక్రమాలు

## అధికారులతో సమీక్షించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, జూన్ 16, జయ జయహే**

ఏపీ ప్రభుత్వం రెండేళ్ల , కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న ఏయూ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి



కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ మీటింగు

హాలులో సమీక్ష నిర్వహించారు. విశాఖ రీజియన్‌కు కేటాయించిన "పెట్టుబడులు - పారిశ్రామిక వృద్ధి" అంశంపై ఈ కార్యక్రమం జరుగుతున్నందున, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేదిక వద్ద ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా డయాస్, సీటింగ్ ఏర్పాట్లు, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, స్వాగత ఏర్పాట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి ఏర్పాటును ముందుగానే పూర్తి చేసి, శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఇన్చార్జి డీఆర్వో టి. గోవిందు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, ఇతర శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మహిళలను కించపరచడం వైసీపీ డి.ఎన్.ఎ.లోనే ఉంది

**విశాఖపట్నం (జయ జయహే)**

వైసీపీ నాయకులకు మహిళల పట్ల కించిత్ గౌరవం భావం కూడా లేదు. సభ్యసమాజం తలదించుకునేలా నిత్యం అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారు. అవకాశం వచ్చిన ప్రతిసారి వారిని అణగదొక్కాలని, కించపరచాలని చూస్తున్నారు. మహిళలను అవమానాలకు గురి చేయడం వైసీపీ డి.ఎన్.ఎ.లోనే ఉంది. సరిగ్గా మూడేళ్ల క్రితం బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన గౌడ కులానికి చెందిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్, ఆకతాయిల వేధింపుల నుంచి సోదరిని రక్షించుకునే క్రమంలో ప్రాణం పోగొట్టుకున్నాడు. ఒక వైసీపీ నేత మరో ముగ్గురితో కలిసి పెట్రోల్ పోసి ఆ బాలుడిని ఘోరంగా చంపేశారు. హత్య చేసిన నిందితులు బెయిల్ పై బయటకు వచ్చి రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారు. శాంతిభద్రతల వైఫల్యానికి.. మహిళల అభద్రతకు ఈ సంఘటన ప్రత్యక్ష సాక్షి. తన దగ్గర పనిచేసే డ్రైవర్ ను ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేశారు. సొంత చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన వారికి కొమ్ము కాస్తూ హత్య కేసు జగన్ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. చెల్లిని కోర్టు చుట్టూ తిప్పుతున్నారు. నా ఎస్సీలు, నా బీసీలు అంటూ కపట




ప్రేమ కురిపిస్తూ అయిదేళ్ల పాటు వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన దౌర్జన్య చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. కూటమి హయాంలో ఇలాంటి హేయమైన సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. హోం మంత్రి అనితను టార్గెట్ చేస్తూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ దిగజారుడు వ్యాఖ్యలు యావత్ మహిళా జాతిని అవమానపరిచాయి. అమర్ పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి

# అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జయప్రదం చేయండి

## అరుణ కుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్,

**విశాఖపట్నం (జయ జయహే)**

అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జయప్రదం చేయండి అని విశాఖపట్నం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం అల్లిపురం చేరువలో పి భూపేష్ నగర్ లో యాక్షన్ ఎయిడ్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ నేతృత్వంలో గృహ కార్మికుల నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 16 వ తేదీన గృహ కార్మికుల దినోత్సవం నిర్వహించాలని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకటించింది అన్నారు. గృహ కార్మికుల సమస్యలు ఏమి ఉన్నా పరిష్కారించడానికి చట్టాలు ఉన్నాయి అని వివరించారు. గృహ కార్మికులందరూ ఈశ్రమ్ కార్డులు పొందాలని కోరారు. కార్మికులకు రక్షణగా లేబర్ డిపార్ట్మెంట్ ఉందని ఆమె వివరించారు ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పాల్గొని మాట్లాడారు.





# పుట్టినరోజున చిల్డ్రన్ హోమ్‌లో అన్నదానం

**తెనాలి (జయ జయహే)**

గుంటూరు జిల్లా, తెనాలి మండలం కఠెవరం గ్రామం లో ఉన్న కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ లో మదనపల్లి కి చెందిన మల్లెపూల మోక్షిత్ పుట్టినరోజు సందర్భంగా తల్లి మల్లెపూల కళావతి, అన్న మల్లెపూల రవి మరియు కుటుంబ సభ్యులు సహకారంతో చిన్న పిల్లలకు, అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు మాట్లాడుతూ మల్లెపూల మోక్షిత్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు అమ్మ మల్లెపూల కళావతి, అన్నయ్య రవి సహకారంతో అన్నదానం చేయడం జరిగిందని, మోక్షిత్ .ఆశీస్సులు తెలుపుతూ కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కె.కె రాజుకు కృతజ్ఞతలు తెలిపిన నాయీబ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు

**విశాఖపట్నం (జయ జయహే)**

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయిబ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు గా నూతనంగా నియమితులైన ఆతవ సుబ్బారావు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 54వార్డు అధ్యక్షులు కడితి చిరంజీవి, నాయి బ్రాహ్మణ సంఘం పెద్దలు అరిపాక పెంటరావు, వేంపాడ నూకరాజు,వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.



## తైక్వాండో క్రీడలో

# జాతీయ స్థాయికు రోషన్ లాల్ ఎంపిక

## రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ప్రశంసలు

**టెక్కలి జూన్ 16 జయ జయహే**

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో మారుమూల ప్రాంతం సంతబొమ్మాలి మండలం చిన్న తుంగాశీ గ్రామం నుంచి బసవల రోషన్ లాల్ జాతీయ పోటీలకు ఎంపిక కావడం హర్షదాయకమని తైక్వాండో క్రీడ కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు, తక్కువ సమయంలో తగిన పట్టుదలతో జాతీయ మెడల్స్ ను సాధించడం ఆనందదాయకమన్నారు, కడప జిల్లా పొద్దుటూరు లో జరిగిన తైక్వాండో పోటీల్లో జాతీయ గుర్తింపు ను రోషన్ సాధించడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు చేతుల మీదుగా మెడల్స్ ను అందుకోవడం మరింత స్ఫూర్తిదాయకమని కుటుంబ సభ్యులు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు, టెక్కలిలో జరిగిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయప్రస్థానం సందర్భంగా మంత్రి అచ్చం నాయుడు మెడల్స్ ను అందజేశారు ,విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ప్రశంసించారు. చదువులతోపాటు క్రీడల్లో ప్రాధాన్యత సాధించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని మంత్రి అచ్చం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## చట్టాలను ఉల్లంఘించే
# విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**అనకాపల్లి జూన్ , 16 (జయ జయహే)**

ఆర్ టి ఈ ప్రకారం ప్రైవేట్ పాఠశాల చదువుతున్న విద్యార్థులకు చట్ట ప్రకారం న్యాయం జరగాలని నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో విద్యార్థుల పేరెంట్స్ ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఉచిత విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో చదివే పిల్లలకు ఉచితంగా యూనిఫారాలు, పుస్తకాలు మరియు ఇతర స్టేషనరీ వస్తువులను అందించాలని ప్రభుత్వము నుండి ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు రియంబర్స్మెంట్ ద్వారా తిరిగి పొందాలని వారు పేర్కొన్నారు కానీ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి రకరకాల పేర్లతో ఫీజుల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఇవి చెల్లించ లేని తల్లిదండ్రులు బాధలు చెప్పలేనివి కావని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులకు తాము ఉచితంగా ఇవ్వని సౌకర్యాలకు కూడా ప్రభుత్వం నుండి దొంగ బిల్లులుతో డబ్బులు డ్రా చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. విద్యాసంస్థల దోపిడీపై ప్రభుత్వ అధికారులు తక్షణం స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధన ఉల్లంఘిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళన అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సురేష్ కుమార్, కన్నబాబు, మదీనా, సంతోష్ కుమార్, వాసు మరియు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు






## మత్తు పదార్థాలు వ్యతిరేకంగా
# యువతకు అవగాహన ర్యాలీ

**అనకాపల్లి ( జయ జయహే).**

సమాజంలో మత్తు పదార్థాలు వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి, యువతను వ్యసనాలకు దూరం చేయడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం మరియు జిల్లా ఆసుపత్రి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఈ అవగాహన ర్యాలీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్పి ఎం శ్రావణి ఆదేశాలు మేరకు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా సాగుతూ నాలుగు రోడ్లు జంక్షన్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో విద్యార్థిని విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, మెడికల్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న వారు నినాదాలు చేస్తూ డ్రగ్స్ వద్దు చదివే ముద్దు అంటూ స్లోగన్స్ చేస్తూ బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రదర్శన చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పి ఈ శ్రీనివాసులు, టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ ,సిఐలు వెంకటనారాయణ ,అశోక్ కుమార్, గోవిందరావు ,ఎస్ ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



## సజ్జలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పెంద్ర వీరన్న

**తాడేపల్లి (జయ జయహే)**

తాడేపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఆ పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న, మర్యాదపూర్వకంగా కలిసి సజ్జల రామకృష్ణారెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా వీరన్న మాట్లాడుతూ రానున్న కాలంలో ఉన్నతమైన పదవులతో, ఆయురారోగ్యాలతో ఎల్లవేళలా ఉండాలని. వీరన్న కోరారు . ఆ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, ఆ ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీలను తిప్పుకొట్టే విధంగా ప్రజల పక్షాన పోరాటం చేయాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కృషి చేయాలని ఆయన భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరు కనకారావు పాల్గొన్నారు

# కలెక్టర్ సాబ్...
# గోవాడ బకాయిల సంగతేమిటి

**చోడవరం, జూన్ 16, జయ జయహే**

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ వి నాయుడు లు డిమాండ్ చేశారు. మంగళవారం చోడవరంలో రైతులతో కలిసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కి చెరుకు ను సరఫరా చేసిన రైతాంగానికి గత ఏడాదికాలంగా బకాయిలను ఇవ్వకుండా తాత్సారం చేసుకుంటూ వచ్చారని, ఈ ప్రాంతంలో రైతులకు, ప్రజలకు ప్రధాన ఆధారంగా ఉన్న ఫ్యాక్టరీని మూసివేత దిశగా తీసుకొని వెళ్ళారని ఆయన నేటికీ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమని వారన్నారు. 2023-24 ఏడాదిలో బకాయిలతో పాటు 2024- 25 ఏడాదిలో బకాయిలు సుమారు 29 కోట్ల రూపాయలను విడుదల చేయకుండా రైతుల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గమని అన్నారు. ఒక వైపు జిల్లాకు అనేక పరిశ్రమలని తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తున్నామంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూసివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మూసివేత కారణంగా సుమారు 28,000 మంది షేర్ హోల్డర్లుగా ఉన్న రైతులు, అందులో పనిచేస్తున్న కార్మికులు, పరోక్షంగా ఉపాధి పొందుతున్న గోవాడ పరిసర ప్రాంత ప్రజలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని అన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ గా ఉన్న జిల్లా కలెక్టర్ని అనేక సార్లు కలిసి బకాయిల విడుదల చేయాలని రైతు , కార్మిక సంఘాలు కలిసాయని, ఇటీవల షుగర్ ఫ్యాక్టరీ వద్ద అఖిలపక్ష కార్మిక రైతు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించగా స్థానిక ఎమ్మెల్యేలు హామీని ఇచ్చారని కానీ నేటికీ బకాయిలు ఇవ్వకుండా రైతులను, కార్మికులను పస్తులు పెడుతున్నారన్నారు. చోడవరంలో గత మూడు వారాలుగా ఈ ప్రాంత ప్రజా సమస్యలపై ప్రజా వేదికలను ఏర్పాటు చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో ముఖ్యమైన సమస్యగా ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ విషయంలో కనీసంగా మాట్లాడకపోవటం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల బకాయిలు విడుదల చేయడం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి దేముళ్ళు, సుంకర అర్జున్, దుర్గా, పెంటకోట రాము, ఈశరపు శ్రీను, వరహాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.





## డయేరియా నివారణ
# ప్రచార కార్యక్రమాలు

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం మండలం జి. కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా. తిరన్, డా. నిఖిత పర్యవేక్షణ లో మండలం లోగల ఆయా గ్రామాలలో "డయోరియా నివారణా ప్రచార కార్యక్రమాలు "జూన్ 16నుండి జులై'31 వరకూ జరుపబడునని వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి డయోరియా కేసులను గుర్తించి వైద్య చికిత్స చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో 0-5 సం. పిల్లలకు ఓ. ఆర్. ఎస్ ప్యాకెట్స్ పంపిణీ, ఓ. ఆర్. ఎస్. ద్రావణము ను తయారు చేయువిధానం,జింక్ టాబ్లెట్స్ అవశ్యకత గురించి సిబ్బంది తెలియజేస్తారని తీవ్ర విరోచనాలు తో బాధపడు పిల్లలను అవసరమైతే ఆసుపత్రికి రిఫర్ చేయాలని తెలిపారు. జులై 1నుండి జులై 7వరకూ పాఠశాలలు సందర్శించి విద్యార్థులు సిబ్బందికి చేతులు పరిశుభ్రత సురక్షిత నీరు, పోషకాహారం పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంగన్వాడీ సెంటర్స్ లో జరిగే వి. హెచ్. ఎన్. డి కమిటీ సమావేశాలలో డయోరియా నివారణా జాగ్రత్త లు త్రాగునీటి పరిశుభ్రత గురించి తెలపాలన్నారు. ఈ రోజు గోకవరం -4సెంటర్ డయోరియా నివారణ, చికిత్స కొరకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం లో హెచ్. వి. రాజేశ్వరి, మోనిక,ఏ. ఎన్. ఎమ్ లు విశ్వనాధం, వేదకుమారి బాపనమ్మ ఎమ్. పి. హెచ్. ఏ పవన్, ఆశాలు రాజేశ్వరి,, నాగమణి,, నాగలక్ష్మి లు పాల్గొన్నారు.



## నీట్ రీ ఎగ్జామ్‌కు
# ఉచిత బస్సు ప్రయాణం

**విజయనగరం (జయ జయహే)**

ఈ నెల 21న జరగబోయే నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం నుండి శ్రీకాకుళం పార్వతీపురం,రాజాం, విశాఖపట్నం, గాజువాక, కూర్మానపాలెం, శృంగవరపు కోట, ఆంద్ర, జక్కువ, సింహాచలం అనకాపల్లి,వీటితో పాటు వసంత, షికారుగంజి, గర్భం, బొప్పడం, గరికివలస, కొండగండ్రేడు, కందివలస, చింతపల్లి మరియు తిప్పలవలస వంటి గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం కల్పించబడినది. బస్సు సౌకర్యమును సద్వినియోగము చేసుకోవలసిందిగా కోరారు.



## ఎంపీ సీఎం రమేష్‌తో సమావేశంలో
# పాల్గొన్న చొక్కాకుల

**అనకాపల్లి (జయ జయహే)**

పూడిమడక రోడ్ ఎంపీ కార్యాలయంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన పత్రికా సమావేశం లో అనకాపల్లి పార్లమెంటు సభ్యులు మరియు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సిఎం రమేష్ పాల్గొని భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాలు పని చేసి ఘనత సాధించారు. 2014 సంవత్సరం నుండి నేటి వరకు భారతదేశం, విద్యారంగం, ఆరోగ్య రంగం, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన, నేషనల్ హైవేస్, గ్రీన్ ఫీల్డ్ హైవేస్, పోర్టులు, ఎయిర్పోర్టులు, కొత్త రైల్వే లైన్స్ మరియు విద్యుత్ దీకరణ లో విశేషమైన ప్రగతిని సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, పి ఏ సి ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, ఈర్లె శ్రీరామ్మూర్తి, పొన్నగంటి అప్పారావు తో కలిసిపాల్గొన్న బిజెపి పార్టీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు

# పశుపోషక రైతులకు అండగా డాక్టర్ రమేష్





అవసర సమయంలో సేవలు అందించేవారే నిజమైన వైద్యులు. అలాంటి సేవాభావంతో పశుపోషక రైతులకు అండగా నిలుస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి."

గార్లదిన్నె (జయ జయహే) గార్లదిన్నె మండలంలో పశుపోషక రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించి పశువుల ప్రాణాలను కాపాడుతున్నారు డాక్టర్ రమేష్. సేవాభావంతో పశుసంపద అభివృద్ధికి కృషి చేస్తూ రైతుల మన్ననలు పొందుతున్న ఆయన సేవలపై (జయ జయహే) ప్రత్యేక కథనం.

**అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందన**

పశువులకు అనారోగ్యం లేదా ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెంటనే స్పందించి చికిత్స అందిస్తూ డాక్టర్ రమేష్ రైతుల విశ్వాసాన్ని పొందుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆయన అందించే సేవలు అనేక పశువుల ప్రాణాలను కాపాడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

**వ్యాధి నివారణకు విస్తృత టీకా కార్యక్రమాలు**

లంపీ స్కిన్, ఎఫ్ఎమ్‌డీ, హెమరేజిక్ సెప్టీసీమియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ టీకా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తూ పశుసంపద రక్షణకు కృషి చేస్తున్నారు.

**మారుమూల గ్రామాలకు సైతం వైద్య సేవలు**

మండలంలోని దూర ప్రాంత గ్రామాల్లో కూడా పశు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతి రైతుకు వైద్య సహాయం చేరేలా కృషి చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నమ్మకమైన వైద్యుడిగా గుర్తింపు పొందుతున్నారు.

**పాడి పశువుల ఉత్పాదకత పెంపునకు మార్గదర్శనం**

సమతుల్య ఆహారం, పశుగ్రాస నిర్వహణ, దూడల సంరక్షణ, మెరుగైన పాల ఉత్పత్తి పద్ధతులపై రైతులకు సూచనలు అందిస్తున్నారు. దీంతో పాడి రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడుతున్నారు.

**కృత్రిమ గర్భధారణతో మెరుగైన జాతుల అభివృద్ధి**

కృత్రిమ గర్భధారణ సేవలను సమర్థవంతంగా అమలు చేస్తూ మెరుగైన జాతి పశువుల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఈ సేవల ద్వారా రైతులకు అధిక ఉత్పాదకత కలిగిన పశువులు అందుబాటులోకి వస్తున్నాయి.

**ప్రభుత్వ పథకాల అమలులో చురుకైన పాత్ర**

పశుసంవర్ధక శాఖ అందించే వివిధ పథకాల ప్రయోజనాలు అర్హులైన రైతులకు చేరేలా కృషి చేస్తున్నారు. ఆరోగ్య శిబిరాలు, ఉచిత మందుల పంపిణీ, టీకా కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

**ల్యాబ్ పరీక్షలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ....**

అనారోగ్యానికి గురైన పశువుల నుంచి రక్త నమూనాలు సేకరించి సింగనమల ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయన ల్యాబ్ నివేదికల ఆధారంగా వ్యాధిని ఖచ్చితంగా గుర్తించి సరైన చికిత్స అందించడంతో పశువులు త్వరగా కోలుకుంటున్నాయి. దీంతో రైతులకు ఆర్థిక నష్టం తగ్గడంతో పాటు పశుసంపద ఆరోగ్యం మెరుగుపడుతోంది.

**సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు చేరువ**

మొబైల్ ఫోన్ ద్వారా సలహాలు అందిస్తూ, పశువుల ఆరోగ్య సమస్యలపై తక్షణ సూచనలు ఇస్తున్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి రైతులకు డాక్టర్ రమేష్ మరింత చేరువయ్యాతున్నారు.

**రైతుల నమ్మకాన్ని గెలుచుకున్న సేవాభావం**

డాక్టర్ రమేష్ రైతుల సమస్యలను ఓర్పుతో వింటూ తక్షణ పరిష్కారాలు సూచించడం, ప్రతి పశువును తన బాధ్యతగా భావించి సేవలందించడం వల్ల డాక్టర్ రమేష్ రైతుల అభిమానాన్ని సంపాదించారు. పశుపోషక రైతులకు నమ్మకమైన వైద్యుడిగా, పశుసంపదకు రక్షకుడిగా నిలిచారు.

**పశుపోషక రైతులకు మెరుగైన సేవలందించడమే నా లక్ష్యం**



పశుపోషక రైతులకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడం నా బాధ్యత. వ్యాధుల నివారణ, మెరుగైన చికిత్స, కృత్రిమ గర్భధారణ, టీకా కార్యక్రమాల ద్వారా పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నాను. రైతులు తమ పశువుల ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని, ఏ సమస్య వచ్చినా వెంటనే పశువైద్యులను సంప్రదిస్తే ఆర్థిక నష్టాలను నివారించవచ్చు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నాను.

**డాక్టర్ రమేష్ మా ప్రాంతానికి రావడం నిజంగా రైతుల అదృష్టం**



పశుపోషణే మా కుటుంబ జీవనాధారం. మా వద్ద 18 బర్రెలు, 100 గొర్రెలు ఉన్నాయి. పశువులకు ఏ సమస్య వచ్చినా డాక్టర్ రమేష్ వెంటనే స్పందించి చికిత్స అందిస్తారు. ఇటీవల అనారోగ్యానికి గురైన మా గొర్రెకు సకాలంలో చికిత్స చేసి కాపాడారు. రైతుల సమస్యలను తమ సమస్యలుగా భావించి సేవలందిస్తున్న డాక్టర్ రమేష్ వంటి అధికారులు ఉండటం మా అదృష్టం.

**- రైతు తాతయ్య, మర్తాడు గ్రామం**

**సమస్య వచ్చిన వెంటనే రమేష్ స్పందిస్తున్నాడు**



నాకు వద్ద 20 ఆవులు ఉన్నాయి. పశువులకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా డాక్టర్ రమేష్ వెంటనే స్పందించి చికిత్స అందిస్తారు. ఇటీవల ఒక పశువు అనారోగ్యానికి గురికాగా సరైన సూచనలు, వైద్యం అందించి కాపాడారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రైతులకు అందుబాటులో ఉండటం అభినందనీయం. ఆయన సేవల వల్ల మా పశుసంపద ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆర్థికంగా కూడా మాకు మేలు జరుగుతోంది.

**--- తిరుపాల్, పశుపోషక రైతు, గార్లదిన్నె**






# హోం మంత్రి అనితకు తక్షణమే క్షమాపణ చెప్పాలి

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాజమహేంద్రవరం నగరంలోని గోరక్షణపేట శ్రీకారం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తెలుగు మహిళ నాయకురాళ్లు తీవ్రంగా ఖండించారు. హోంమంత్రి వంగలపూడి అనితపై చేసిన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజమండ్రి పార్లమెంట్ తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగుకుమారి మాట్లాడుతూ, మహిళల వ్యక్తిగత విషయాలపై వ్యాఖ్యానించడం సమాజానికి తప్పు సంకేతాలు పంపుతుందని అన్నారు. ప్రజాసేవలో విశిష్ట పాత్ర పోషిస్తున్న హోంమంత్రి అనితపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మహిళా సమాజాన్ని అవమానించినట్లేనని పేర్కొన్నారు.మహిళా



సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు బాధాకరమన్నారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని హోంమంత్రి అనితకు, రాష్ట్ర మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించి మహిళలను అవమానించే వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించిన తెలుగు మహిళ నాయకురాళ్లు, మీడియా సమావేశం అనంతరం అమర్నాథ్ చిత్రపటానికి గుడ్లు, చెప్పులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తురకల నిర్మల, తుల్లి పద్మ, లీలావతి, కర్ణం లక్ష్మీనాయుడు, దొంగ నాగమణి, కానేటి కృపామణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



## అమరనాథ్ చిత్రపటంపై
# కోడి గుడ్లుతో నిరసన

**అమర్నాథ్ చిత్రపటంపై**

**కోడి గుడ్లతో కొట్టి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు**

**బుచ్చయ్య పేట జయ జయహే**

హోమ్ మంత్రి వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ క్షమాపణలు చెప్పాలని కోరుతూ మంగళవారం బుచ్చయ్యపేట పిఏసిఎస్ వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాకారపు నాగేశ్వరీ దేవి మాట్లాడుతూ మహిళని చూడకుండా హోమ్ మంత్రి అనిత పై అనుచితంగా మాట్లాడడమే కాక మహిళను కించపరిచే విధంగా మాట్లాడడం దారుణం అన్నారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా అమర్నాథ్ చిత్రపటానికి కోడి గుడ్లతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ సుంకర లక్ష్మి, గాడి నాగమణి, మాజీ ఎంపీటీసీ , సూరాతి పేరమ్మ, పడాల భూలక్ష్మి, తదితరులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



## విశ్వజనీనసూత్రాల సమాహారం
# సనాతనధర్మం

**డా. బోలుగద్దె అనిల్ కుమార్**


**నంద్యాల (జయ జయహే)**

సంస్కృతి, కులమత ప్రాంతభేదాలు లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అందరికీ వర్తించే ప్రాథమికసూత్రాలనే విశ్వజనీన సూత్రాలంటారని, సత్యం, అహింస, చర్యకు ప్రతిచర్య వంటి కర్మ సిద్ధాంతం, కారుణ్యం, ప్రకృతి ధర్మాలు ఇవన్నీ విశ్వజనీన సూత్రాలేనని, ఈ సూత్రాలన్నీ సనాతనధర్మానికి ఆధారభూతమైన వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు మొదలైన వాటిలో ఉన్నాయనీ, ఈ సూత్రాలు మహర్షుల ద్వారా ఆధ్యాత్మిక, శాస్త్రీయ, ధర్మసూత్రాలుగా వర్గీకరింపబడి మన వరకు అందాయని, ఈ ధర్మాలు మూర్తీభవించి దశావతారాలుగా భారతదేశముపై నడయాడినాయని, విదేశీయుల విజ్ఞాన పరిశోధనల్లో సైతం తమ ఉనికిని చాటినాయని ప్రవచనకర్త డా. బోలుగద్దె అనిల్ కుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల మండలం, పెద్దకొట్టాల గ్రామంలోని శ్రీ రామాలయం నందు ఏర్పాటుచేసిన ధార్మిక ప్రవచనాల్లో భాగంగా వారు మొదటి రోజు ధార్మిక సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామాలయం కమిటీ చైర్మన్ అన్నెపురెడ్డి నాగప్రసాద్ రెడ్డి, గండా బాలశివారెడ్డి, సుబ్బారావు, రాముడు, పెద్ద వీరయ్య, లక్ష్మీదేవి, ఈశ్వరరావు, కుమ్మరి మద్దిలేటి, బి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు మంగళవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6-00 గంటలనుండి 8-00 గంటల వరకు జరుగనున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు.

# 18న సబ్ కలెక్టరేట్ ముట్టడిస్తాం

**కాంగ్రెస్ నేత టీకే విశ్వేశ్వరరెడ్డి**

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**



ఇందిరా సత్యనగర్‌లో నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయించడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన, నగరపాలక సంస్థ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇళ్లు ఆక్రమణలేనని చెబుతున్న అధికారులు గతంలో ఇంటి పన్నులు ఎలా వసూలు చేశారని, తాగునీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ సౌకర్యాలు ఎలా కల్పించారని ప్రశ్నించారు. సారంగధరమెట్ట నుంచి సువిశేషపురం వరకు ఉన్న పుంతరోడ్డుపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించకుండా ఇళ్ల తొలగింపులు చేపట్టడం సరికాదన్నారు. గత 45 ఏళ్లుగా అక్కడే నివాసం ఉంటున్న పేదలను బెదిరించి రోడ్డున పడేయడం అన్యాయమని పేర్కొన్నారు.రోడ్డు విస్తరణ అవసరమైతే ముందుగా సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు అదే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున పేదలు నివసిస్తున్న ప్రాంతంలో పేదలపైనే చర్యలు తీసుకోవడం తగదన్నారు. రోడ్డును 40 అడుగులకు విస్తరించి, ఆక్రమణలు తొలగించిన అనంతరం అక్కడే నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు.ఇందిరా సత్యనగర్ బాధితుల నుంచి ఓ బీజేపీ నాయకురాలు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు. సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 18న బాధిత కుటుంబాలతో కలిసి సబ్ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.బాధితురాలు ధవలేశ్వరపు సరోజిని మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ స్థలం లేదా ఇల్లు చూపిస్తే వెళ్లేందుకు సిద్ధమేనని, కానీ ఎలాంటి ఏర్పాట్లు చేయకుండా జేసీబీలతో ఇళ్లు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రరావు, బి.అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com